



# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు



# ఇదిగో 'వంద'

**ఇండియాలో** బద్ధకస్తులు పెరిగిపోయారు. చాలామంది ఏ పనీ చెయ్యరు. సౌకర్యాలొచ్చాయి. ఇతర దేశాల్లోలాగా కాదు డబ్బు పారేస్తే వచ్చి చేసే పనివాళ్ళు దొరుకుతారు. దాంతో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చెయ్యడం, సెల్‌ఫోన్లలో ఫార్వర్డ్ మెసేజ్‌లు పంపించుకోడం... ఎఫ్.బీలో ట్విట్టర్లలో "నాకు ఇవాళ గెడ్డం చేసుకోవాలి అనిపించడం లేదు.. వాట్ డు యూసే?" అనో "ఇవాళ పక్కింటి ఆవిడ ఇంట్లో బాత్‌రూంకి వెళ్ళాను. ఆవిడ ఇంట్లో ఓడోనిల్ లేదు" అనో పోస్ట్‌లు పెట్టడం. ఇదివరకు ఆదివారాలొస్తే ఇళ్ళకి బంధువులొచ్చేవారు. ఇప్పుడు వాళ్ళూ టీ.వీలకీ, నెట్‌ఫ్లిక్స్‌లకీ అతుక్కుపోయి ఎవరి ఇళ్ళకీ రావడంలేదు.

గవర్నమెంట్ ఎంప్లాయిస్ పని చెయ్యరు అన్నది ఎప్పటి నుండో వస్తున్న మాట పాపం. కానీ బ్యాంకుల్లోనూ ఎవరికీ పనీపాటలు లేవు. అందరం ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లు నేర్చుకున్నాం. ఉన్నవాడికి 'బ్లాక్ బస్టర్స్' మనీ ఎక్కువై అస్సలు తోచడంలేదు. వాటిని పనామస్‌లోనో, బహామాస్‌లోనో దాచుకోవడంలో బిజీ అయిపోయారు.

ఏం చెయ్యాలీ అని 'పెద్దాయన' ఆలోచించాడు. అందరూ హాయిగా గూళ్ళు చేరి, ఇంక బయటకి వెళ్ళము అని తీర్మానించుకుని లుంగీలు కట్టుకుని, నైటీలు వేసుకుని టీ.వీలు చూస్తుండగా పిడుగులా వచ్చి పడిందా వార్త 'ఐదువందలూ.. వెయ్యి నోట్లూ బ్యాన్ చేస్తున్నాం ఈ అర్ధరాత్రి నుండీ' అని.

ఇంకేం వుందీ... కకావికలైపోయారు జనం. నాకు ముచ్చటేసిందేవిటంటే నిమిషాల్లో ఎంత క్రియేటివిటీ చూపించారో మన జనం! ఎన్నెన్ని జోక్సో, ఫార్వర్డ్సో.

"అన్నయ్యగారు ఏం చేస్తున్నారు?" అని పక్కింటావిడ అడిగితే" బ్యాంక్ కి వెళ్ళారు" అని వదిన జవాబు.

"తాతగారూ ఎక్కడున్నారు? మందులు వేసుకునే టైం అయింది" అంటే "క్యూలో వున్నానే బ్యాంక్ దగ్గర. ఆ నిద్రమాత్రా, బి.పి మాత్ర ఇక్కడికే పంపు. ఓ కునుకు తీసి లేస్తా క్యూలో" అని తాతగారి జవాబు.

ఈ రకంగా పిల్లా పీచూ, పెద్దా, చిన్నా తారతమ్యం లేకుండా అంతా బ్యాంక్‌ల దగ్గర క్యూలు కట్టారు. ఎప్పుడూ పని చెయ్యరన్న అపవాదు నెత్తి వేసుకున్నా ప్రభుత్వాలూ పని చెయ్యాల్సొచ్చింది. బ్యాంక్‌ల వాళ్ళూ యుద్ధం అప్పుడు సైనికులు పనిచేసినట్లు, పని చెయ్యాల్సొచ్చింది.

ఎన్నడూ మంచం దిగని బద్ధకపు సత్తిరాజూ, ఎన్నడూ ఇంట్లోకి సరుకులు ఎలా వస్తున్నాయో పట్టించుకోని నాంచారమ్మా బ్యాంక్‌కి వెళ్ళాల్సొస్తోంది. గంటల తరబడీ క్యూల్లో నిలబడ్డాకా లోపల "ఎకౌంట్లో డబ్బు కట్టి వెళ్ళండి. డబ్బులు లేవు" అంటున్నారు. లేదా 2,000రూపాయల కొత్త నోటు ఇస్తున్నారు.

ఆ 2000 నోటు పట్టుకుని ఫోజులిచ్చి ఎఫ్.బిలో ఫోటోలు పెట్టిన ముచ్చటా, మైకం తెల్లారేకల్లా దిగిపోయింది. పాత ఐదువందలకైనా విలువ వుంది. కానీ ఈ కొత్త 2000కి చిల్లర ఇవ్వం అన్నారు. ఆపాటికే ఇంట్లో వున్న ఐదువందల నోటల్లా, వెయ్యి నోట్లూ వూడ్చి బ్యాంక్‌ల్లో కట్టేసారు జనం.

పెట్రోల్ బంక్‌కి వెళ్ళి వెయ్యి నోటిస్తే "మొత్తం పోయించుకో.. చిల్లర లేదు" అంటాడు. కార్డు మీద పే చేస్తుంటే, సూపర్ మార్కెట్లో "ఆవాలు ఇస్తావా?" "ఇరవైరూపాయల ఆవాలుతోబాటు ఇంకో ఎనభై పెట్టి పంచదారో, జీలకర్రో కొనుక్కోండి. మినిమం వంద రూపాయిలు ఖర్చు చెయ్యాలి" అంటారు.

బుజ్జిగాడు కాళ్ళు బాది ఏడుస్తున్నాడు పిప్పర్‌మెంట్ కోసం. జేబులో 2000 నోటు వెక్కిరిస్తోంది. క్రెడిట్ కార్డు తీస్తే పిప్పరమెంట్ ఐదురూపాయిలైతే ఇంకో తొంభై ఐదు పెట్టి అవసరం లేని చెత్త అంతా కొనిపిస్తున్నారు.

"సన్యాసి కేం తెలుసు సంసారుల తిప్పలనీ" అని ఎవరో కష్టజీవి సణుగుతున్నాడు.

అవును మరి ఆయనకేం భార్యా? పిల్లలా? కూరలు తెమ్మనడానికీ, పిప్పరమెంట్లు కావాలని కాళ్ళు బాదడానికీ, పోనీ ఇంటికొచ్చిపోయే చుట్టాలా? తమ్ముడు ఇంకా ఏదో చిన్న స్కూలు మాస్టరీనో ఏదో చేసుకుంటున్నాడు. తల్లి ఆటో రిక్షాల్లో తిరుగుతుందీ? మేనకోడలు పోతే పట్టించుకోకుండా ఐక్యరాజ్యసమితి సమావేశాలకి వెళ్ళిపోయే పెద్దమనిషికి ఏం బాధ్యతలున్నాయని ఇవన్నీ తెలుస్తాయండీ?

కష్టపడి నానా గడ్డీ కరిచి, పగలూ రాత్రీ అవస్తలు పడి బోలెడు నోట్లు లెఖ్కాపత్రం లేకుండా సంపాదించి, బ్యాంకుల్లో కట్టుకో లేక, నానా ఇబ్బందులూ పడి సందుల్లో గొందుల్లో రసీదులు లేకుండా బంగారాలూ, వజ్రాలూ కొని దాచిన వాళ్ళ ఇక్కట్లూ, బహమాస్‌కో పనామాస్‌కో, స్విజ్‌కో ఎగుమతీలు చేసి ఏ ఏజెంటు ద్వారానో ఇవన్నీ రాత్రికి రాత్రి డాలర్లుగా, రియాద్‌లుగా, రింకెట్లుగా మరేదోగా మార్చుకోడానికి పడ్డ అగచాట్లూ?

బంగారం ఏం చేసుకోవాలో తెలీక బిందెలు చేయించి కేంద్రమంత్రులకి ఇచ్చీ, వాష్ బేసిన్లూ, వీలైతే కమోడ్లూ చేయించుకున్న పెద్ద మనుషుల కడగండ్లూ? ఇవన్నీ ఆయనకేం పట్టాయా? "ప్యారీ భాయీయో... ఔర్ బహనియో...." అంటూ అందర్నీ తన స్వంత తమ్ముడలా, చెల్లెళ్ళలా చూసుకుంటున్నాడు. ఇది విని మీరు పోట్లాడలేరు. ఎందుకంటే వాళ్ళనీ ఆయన నానా కష్టాలూ పెడ్తున్నాడు. ఓ ఎమ్.ఎల్యే టికెట్ ఇచ్చాడా తమ్ముడికీ? పార్టీల్లో సీట్లు ఇచ్చాడా చెల్లెళ్ళకీ? అమ్మకి రాజసౌధం కట్టించాడా? తిరగడానికి బెంజ్ కారిచ్చాడా? కాబట్టి దేశ ప్రజల్నీ స్వంత వాళ్ళలాగే చూసుకుంటున్నాడట.

అందరికీ కోపం వచ్చింది ఈ పని చెయ్యడంవల్ల. సోనియాకీ రాహుల్‌కీ కూడా చాలా కోపం వచ్చింది. వాళ్ళ ప్రభుత్వంలో 'పావలా' బ్యాన్ చేసారు. పెద్దమనుషులకి ఇబ్బంది లేకుండానూ. కానీ ఇదేవిటండీ. ఇంత పెద్ద నోట్లు బ్యాన్ చెయ్యడం? నా లెవల్ 'వెయ్యి' అని చెప్పుకోడం కోసమా? బడాయి కాకపోతేనూ.

సామాన్యుడికి బాగా కోపం వచ్చింది. ఆఫీస్‌కే వెళ్ళాలా? బ్యాంక్‌కే వెళ్ళాలా? ఏ క్యూలో నిలబడాలని? ఇంక తాగుబోతులకి గడ్డు పరిస్థితులు. చిల్లర లేదు కాబట్టి మందు మొత్తం 2000దీ తాగాలి. లేదా మానెయ్యాలి. అసలు శని, ఆదివారాలు మందు కోసమే క్యూలో నిలబడాలా? బ్యాంక్ దగ్గరే క్యూలో నిలబడాలా? లేక చిల్లర బదులు బ్యాంక్ వాళ్ళే మందు సరఫరా చెయ్యాలా? ఇవన్నీ ఆయనకేం తెలుస్తాయండీ అసలూ?

తాయారమ్మగారి అమ్మాయి పెళ్ళిచూపులు, ఇంట్లో ఇబ్బంది అని బ్యాంక్ క్యూ దగ్గరే చేసేసారుట. మరి అబ్బాయికీ 2000కి చిల్లర కావాలీ, అమ్మాయికీ కావాలి.

వెధవ గొడవ. పనిమనిషీ, పాలవాడూ, కేబుల్ అబ్బాయీ అంతా వచ్చి డబ్బులు అడుగుతున్నారు కదండీ! అమెరికాలో నేను ర్యాలీ డౌన్‌టైన్ లో రిక్షా అతనికీ కార్డ్ స్వైప్ చేసాను. వీళ్ళు ఎప్పుడు నేర్చుకుంటారో! నిన్న ఇల్లు అంతా క్లీన్ చేయించి ఎప్పుడూ 600 ఇచ్చేదాన్ని 2000రూపాయల నోటు గప్‌చుప్‌గా చేతిలో పెట్టాను. చిల్లరలేదు మరి. గ్యాస్ దగ్గరనుండీ ఆన్‌లైన్ కట్టుకుంటే, మా గ్యాస్ సిలిండర్ వేసే తుకారాంకి పై సంపాదన పోతుంది. ఎప్పుడూ చిల్లర ఓ యాభై నొక్కేస్తాడు.

మా బ్యాంక్ మేనేజర్ ఎప్పుడూ ఫిక్సెడ్‌లు చెయ్యండీ, రికరింగ్ డిపాజిట్లు చెయ్యండీ అంటే విసుక్కుని తలుపేసి పడుకునేదాన్ని. ఇప్పుడు ఫోన్ చేసి ప్రేమలు కారిపోతూ "ఓసారి వచ్చి కాఫీ తాగి వెళ్ళచ్చుగా.. ఇంతకీ వందరూపాయల నోట్లు వచ్చాయా? 2000కి చిల్లర ఇస్తారా?" అని చిల్లరగా అడుక్కుంటున్నాను.

శకుంతల బ్యాంక్‌లో ఎటెండర్ టీ.వీ సీరియల్స్ పిచ్చి ఎప్పుడు నేను బ్యాంక్‌కి వెళ్తే "సీతామాలక్ష్మికి రాజశేఖరానికీ పెళ్ళి జరుగుతుందా? లేక "రాజశేఖర్, జానీ ఒక్కడేనా?" అని వేధించేదని విసుక్కునేదాన్ని. ఇప్పుడు ఆ శకుంతల నా హెడ్ మీద గాడెస్స్ అయి కూర్చుంది. లైన్ లో చివర నిలబడితే, ముందుకి లాక్కెళ్ళిపోతుంది పాపం.

రేపు శనివారం మా వారు జహీరాబాద్‌నుండి వస్తున్నారు. ఆయనకి పి.ఎఫ్. ఫార్మ్స్ మీద సంతకాలు కావాలట. బ్యాంక్ ముందు హనుమంతుడి తోకలా వున్న క్యూ దాటి లోపలికి వెళ్ళడానికి "ఆ బ్యాంక్‌లో నీ అభిమాని ఎవరో వున్నారుగా? కాస్త ఫోన్ చేస్తావా?" అని ప్రాధేయపడ్డారు. "మొన్నటిదాకా నా అభిమానుల తెలివితేటల మీద మీకు చిన్న చూపుగా. ఇప్పుడు ఎలా పనికొస్తారు పాపం!?" అన్నాను. ఆయనచేత కాసేపు బతిమాలించుకుని ఫోన్ చేసా మేనేజర్‌కి.

అతను "పొద్దుట నుండీ ఆర్.బి.ఐ దగ్గర క్యూలో నిలబడితే ఇప్పుడొచ్చానమ్మా. బ్యాంక్‌కి క్యాష్ ఇవ్వడానికి చంపుకు తింటున్నారు. వందలు అడిగితే పోపో.. వందా లేదు నీ బొందా లేదు అని తరిమేస్తున్నారు. ఇక్కడేమో నేను చిల్లర వుంచుకుని ఇవ్వడం లేదేమో అనుకుని ఎవరో యాదగిరిట ఈ పేట గూండాట. ‘ఇంటికి సక్కగ పోతావా? కాళ్జేతులు ఇరగ్గొట్టాల్నా?‘ అని వార్నింగులిస్తున్నాడు. మాకు కనీసం ఓ సెక్యూరిటీ గార్డుని కూడా ఇవ్వడం లేదు ఇళ్ళకి వెళ్ళడానికి. ఉదయం ఎవరూ లేవక ముందు బ్యాంక్‌కి వస్తున్నామా! రాత్రి పిల్లలు పడుకున్నాక వెళ్తున్నాం. మీ వారిని పంపితే కాస్త ముందు జాగ్రత్త చర్యలతో పంపించండి. భోజనం చేసి రాకపోతే టిఫిన్ బాక్స్‌లో ఏ దిబ్బరొట్టో పెట్టి పంపండి. మంచి నీళ్ళ బాటిల్ వడగొట్టకుండా నిమ్మకాయరసం వేసిన మజ్జిగలాంటివి పంపండి. ఎర్లీ మార్నింగ్ పంపితే ఏ సాయంత్రానికో పని జరగచ్చు. కాస్త రాహుకాలం, వర్జం చూసి పంపండి. ఆ తర్వాత మా పూచీలేదు" అన్నాడు.

చిన్నప్పుడు శ్రీరామనవమి పందిళ్ళలో మా చాపలు మేమే తీసుకెళ్ళేవాళ్ళం. అలా ఈయనకి ఓ ఫోల్డింగ్ చైర్ పంపనా అని ఆలోచనలో పడ్డాను.

ఇంక ఇల్లాళ్ళ విషయం మాట్లాడకుండా ఈ కాలమ్ ముగించడం నేరమే అవుతుంది. ఇల్లాళ్ళ ఇక్కట్లు చెప్పాలంటే గుండె చెరువౌతుంది. వాళ్ళు పెట్టారనీ, వీళ్ళు పెట్టారనీ దాచినవీ, పాలల్లో కూరల్లో మిగిల్చిపారేసినవీ మొగుడికి తెలీని ‘నల్లధనం‘ బ్యాంక్‌లో కడితే మొగుడికి తెలిసి ‘వైట్‘ అయిపోతున్నాయి. దాచుకుంటే చలిమంటకి తప్ప పనికిరావు పాపం.

అసలు ట్రంప్‌గారూ, మోదీగారూ కలిసి ఇలా ‘బ్లాక్‘ని హేట్ చెయ్యడం ఏమీ బాగోలేదు. నల్లకుబేరులు అంతా ‘నల్లపొణ్ణుల్లా‘ తేలుకుట్టిన దొంగల్లా మాట్లాడ్డం లేదు. అంతా గప్‌చుప్ సాంబారు బుడ్డీ. ఏం చేసారోకానీ నోట్లన్నీ పి.సీ సర్కార్‌లా మాయం చేసి పైకి ట్యాంక్‌బండ్ బుద్ధుడిలా నిబ్బరంగా కనిపిస్తున్నారు.

నేను ఒకరిద్దరు ‘బడాబాబుల్ని‘ కదిపి చూసాను. "ఏవైనా సాయంకావాలా? ఓ రెండు సూట్ కేసులు పంపిస్తారా?" అని.

"అబ్బెబ్బే అసలేం లేనిదే" అనేసారు.

మరి వున్నదల్లా ఈ కూరగాయలు అమ్మేవాళ్ళ దగ్గరా, ట్రాఫిక్ లైట్స్ దగ్గర అడుక్కునే వాళ్ళ దగ్గరానా?

మా అమ్మ "నా నాలుగువేల ఐదువందల నోట్లూ ఎకౌంట్లో కట్టాను. కానీ చిల్లర ఇవ్వలేదే? గుడికి వెళితే హుండీలో వెయ్యనుకానీ, ఆ గేట్ దగ్గర అమ్మాయికి ఇస్తాను పాపం. పెద్దది టెన్త్ పాసయిందిట. చిన్నది ఐదు కొచ్చిందట. మొగుడొదిలేసాడు. అత్త రాచిరంపాన పెడ్తోంది" అని బోలెడు బయోగ్రఫీ చెప్పుకొచ్చింది. నా దగ్గరున్న వందరూపాయల నోట్లు ఐదూ అమ్మ చేతిలో పెట్టా.

అమ్మ కన్నీళ్ళతో ‘కృతజ్ఞురాలయిపోయింది‘ ఆవిడ కళ్ళకి నేను కృష్ణావతారంలో లాస్ట్ సీన్‌లో ఎన్.టీ.ఆర్.లా తెర అంతా నిండిపోయి కనిపించాను.

సో చెప్పొచ్చేదేంటంటే ఈ గుజరాతీలు ‘తియ్య‘గా మాట్లాడ్తారు. ఎందుకంటే ‘తీపి‘ తప్ప ఆవకాయలోకూడా మరో రుచి కనిపించదు. వీళ్ళని ‘గుజ్జు‘ లు అంటాము. ఎందుకంటే బుర్రలో గుజ్జు ఎక్కువ. ఈయన మీద ‘సామాన్యుడు‘ విరుచుకు పడ్తున్నాడు

'అసామాన్యులూ' విరుచుకు పడ్తున్నారు. మరేమౌతుందో చూద్దాం. సంసారంలేని వాడిని ఎన్నుకుంటే నన్ను బోలి బ్రతకమంటాడు మరి. కానీ మోడీజీ మీరేం భయపడకండి. మాకు ఈ క్యూలల్లో నిలబడ్డం అలవాటే. చిన్నప్పుడు పాలకోసం పాలబూత్‌ల దగ్గర నిలబడేవాళ్ళం, స్కూలు పుస్తకాలు కోసం నిలబడ్డాం, కిరోసిన్ కోసం, చక్కెర కోసం రేషన్ షాపుల్లో నిలబడేవాళ్ళం. సినిమా టిక్కెట్ల కోసం రోజుల తరబడి నిలబడిన వాళ్ళున్నారు. కరెంట్ బిల్లు, వాటర్ బిల్లు కోసం నిలబడ్డాం, ధర్మాసుపత్రుల్లో ప్రాణాలు కడంటి పోయేదాకా నిలబడ్డాం, పిల్ల పుడితే నిలబడ్డాం, మనిషి పోతే డెత్ సర్టిఫికెట్ కోసం నిలబడ్డం అలవాటే.

ఆన్ లైన్ పేమెంటు లేని రోజుల్లో అన్నింటికీ లైన్లలో నిలబడ్డం మాకు మొదటినుంచీ అలవాటే. ఎప్పుడూ ఏ ప్రభుత్వాన్నిని మేము ప్రశ్నించలేదు ఎందుకింత సేపు లైన్లలో నిలబడాలని. ఇప్పుడు మీరు దశ దిశ నిర్దేశించి ఒక గమ్యం చూపిస్తూ వుంటే ఆశావాహంగా అడుగులేస్తున్నాం. కానీ మాకు ఒక వెలుగురేఖని మాత్రం మీరు ప్రసాదిస్తారని మేం ఆశిస్తున్నాం. ఇస్తారుకదూ! అందుకే మీ వెన్నంటి నడుస్తున్నాం. ఏమైనా ఇంత గుండె దిటవుగల ప్రధానిని చూడటం మొదటిసారి. మనదేశానికి క్యూడా మంచి రోజులు వచ్చేస్తున్నాయేమోనని అనుమానంగా ఉంది.

***ఇది వందో కాలమ్. వందరూపాయల నోట్లు ప్రాప్తిరస్తు అని ఆశీర్వదించండి మరి.***

COMMENTS

